



# భరింపువాడు

వసుంధర

**కాలింగ్ బెల్** మోగగానే ఉలిక్కి పడి లేచింది ఇందుమతి. ఆమె కనుల మత్తు ఇంకా వదలలేదు. ఆమె మంచం మీంచి లేచీ లేవగానే మరోసారి మోగింది కాలింగ్ బెల్.

"ఇంకెవరు ఆయనే అయుంటారు" అనుకుందామె.

ఒకసారి బట్టలు సవరించుకుని మత్తుగా ఆవలించి పడక గది లోంచి బయట పడగానే మరోసారి కాలింగ్ బెల్ మోగింది.

రెండంగల్లో పరుగున వెళ్ళి వీధి తలుపు తీసిందామె.

అప్పారావు నవ్వుతూ లోపలకు ప్రవేశించాడు.

"ఏమిటండీ! నేను వచ్చే లోగా అంత తొందరేమిటీ?" అంది ఇందుమతి విసుగ్గా. "కాలింగ్ బెల్ అన్ని మార్లు మోగించారు!"

అప్పారావు నవ్వి, "నువ్వు నిద్ర పోతూంటావని నాకు తెలుసు. అందుకే అన్ని సార్లు కాలింగ్ బెల్ కొట్టాల్సొచ్చింది. పోనీ లోపల నుంచి వస్తున్నా అని ఒక్క మాట అనొచ్చు గదా నువ్వు" అన్నాడు.

"బాగుంది. వచ్చింది మీరేనని తెలిస్తే అలాగే అనేదాన్ని."

"అవునూ ఎప్పుడు కావాలంటే అప్పుడు నీ కింత నిద్ర ఎలా పడుతుందో చెప్పవూ?" అన్నాడు అప్పారావు.

"ఎప్పుడు కావాలంటే అప్పుడు నిద్ర పోయే అవకాశం లేకనే, ఎప్పుడో ఒకప్పుడు నిద్ర పోతుంటాను నేను" అన్నది ఇందుమతి.

అప్పారావు ఏదో అనబోయాడు కానీ, ఆమె అతన్ని మాట్లాడ నివ్వలేదు. ఉదయం నించి రాత్రి వరకూ ఎన్ని పనులుంటాయో, తీరుబడి దొరకడం తనకు ఎంత కష్టమో ఇందుమతి అతడికి వివరించి చెప్పింది.

"నీ గురించి నువ్వే అలా అనుకుంటే మరి నా సంగతి ఏమిటి? నన్ను గురించి నేనే మనుకోవాలి?" అన్నాడు అప్పారావు.


"మీరా?" అని పకపకా నవ్వింది ఇందుమతి. "ఇంట్లో ఉన్నంత సేపూ మీ పనులుకూడా నేనే చేయాలి. నాకు పని చెరుపు తప్పితే మీ వల్ల ప్రయోజనమేమీ లేదు. ఆ పైన ఆఫీసుకు వెళ్ళి కూర్చుంటారు. ప్రజల సొమ్ము తినడమే కానీ, మీ వల్ల ప్రజలకు చిన్న మెత్తు ఉపకారం కూడా జరగదు. ఆ పైన ఇంటికి వెంటనే రాకుండా పనికిరాని పెత్తనాలు" అనీ—"అవునూ ఆ రంగనాథం గారప్పుడే వచ్చేశారు కదా. మీ కెందుకు ఇంత ఆలస్యమయిందీ?" అన్నది ఇందుమతి.

"ఈ రోజు ఆఫీసులో రీటా పార్టీ ఇచ్చింది. ఆమెకు మెరిట్ ప్రమోషన్ అని ఒక ఇంక్రిమెంట్ ఎక్స్ట్రాగా ఇచ్చారు. అందుకని ఆఫీసు కాగానే పార్టీ! కొలీగ్సందరం హాజరయ్యాం" అన్నాడు అప్పారావు.

"మరి రంగనాథంగారు ఆ రీటాకు కొలీగ్ కాదా?" అన్నది ఇందుమతి.

"ఎందుకు కాదూ? కానీ ఆయనకు భయం. ఆయన భార్య పెద్ద అనుమాన పిశాచి అని నీకు తెలియదా?" అన్నాడు అప్పారావు.

రంగనాథం గురించి ఇందుమతికి అప్పారావు ద్వారానే తెలుసు. అతడి భార్యకు అతడి మీద




విపరీతమైన అనుమానం. భర్తను క్షణం కూడా వదలదు. అతడు ఆడవాళ్ళతో మాట్లాడటానికి వీల్లేదు. ఆఫీసునుంచి ఆలస్యంగా రావడానికి లేదు. ఆఫీసుకు పెందరాళే వెళ్ళడానికి లేదు. బయటకు ఎప్పుడు వెళ్ళినా భార్యతో కలిసి వెళ్ళాలి.

"అదేం మనిషో ఎందుకో అనుమానం?" అన్నది ఇందుమతి.

"ఇందూ!! అందరూ నీకులాగే ఉంటారా? అదంతా నా అదృష్టం" అన్నాడు అప్పారావు.

అప్పారావు ఈ మాటలు మనస్ఫూర్తిగా అన్నాడు. అసలతడికి మనుష్యుల్ని కావాలని పొగిడే అలవాటు లేదు.

ఇందుమతి అప్పారావును దేనికీ నొప్పించదు. ఆఫీసుకు పెందరాళే వెడతానంటే వెళ్ళనిస్తుంది. ఆలస్యంగా వస్తే కారణం తెలుసుకుని వూరుకుంటుంది. అతడు ఎల్లకాలం తనతోనే తిరగాలని నొక్కించదు. ముఖ్యంగా తోటి ఆడవాళ్ళ విషయంలో ఆమె హృదయం మరీ విశాలం.

వాళ్ళకు నాలుగిళ్ళ అవతల శారద అనే అమ్మాయి ప్రయివేటుగా బియ్యేకు కడుతున్నది. ఆమెకు సాయం చెయ్యమని భర్తను తనే ప్రోత్సహించింది ఇందుమతి. శారద రోజూ వాళ్ళింటికి వచ్చి ప్రయివేటు చెప్పించుకుని వెడుతుంది. భర్త శారదకు ప్రయివేటు చెబుతూంటే ఇందుమతి వాళ్ళను కనిపెట్టి కూర్చునేది కాదు. తన పనుల్లో తానుండేది. నాలుగు రోజుల్నించి శారద వూళ్ళో లేదు.

శారద మనిషి బాగుంటుంది. అప్పారావుకు అప్పుడప్పుడు బుద్ధి చెదిరేది. కానీ తెలిసిన వారి పిల్ల. అతడు మర్యాదస్తుడిలా ప్రవర్తించే వాడు. ఆమె చాలా బుద్ధిగా మసిలేది. శారదకు ప్రయివేటు చెప్పడం ద్వారా అప్పారావుకు ఆ వీధిలోనే మంచి పేరు వచ్చింది.

అప్పారావు పక్కింట్లో ప్రదీప్ ఉంటున్నాడు. అతడి భార్య జ్యోత్స్న. ప్రదీప్ మనిషి బాగుండడు. భార్య పక్కన నిలబడితే ఆమె కంటే ఒక అరంగుళం పొట్టిగా ఉన్నాడా అనిపిస్తుంది. మనిషి ఛాయ నలుపుకు దగ్గర. ముఖంలో కళకూడా తక్కువ. అతను ఏదో ప్రయివేటు కంపెనీలో పని చేస్తున్నాడు. జీతం బాగానే వస్తుంది కానీ భార్యంటే బొత్తిగా పట్టదు. ఎప్పుడూ ఇంటి పట్టున ఉండడు. ఒకోసారి అర్ధరాత్రి వేళ ఏ క్లబ్బు నుంచో తాగి వస్తాంటాడు. అప్పుడప్పుడు భార్యను కొడతాడని అప్పారావు అనుమానం.

జ్యోత్స్నకు ఇరవై ఏళ్ళుంటాయి. పెళ్ళయి రెండేళ్ళయింది. మనిషి చాలా అందంగా, సన్నగా, నాజూగ్గా ఉంటుంది. చూడగానే మరోసారి చూడాలనిపిస్తుంది. ఆమె కనులు ఎంత బాగుంటాయో చెప్పడం కష్టం. ఎప్పుడైనా ఆమె ఓరకంట చూసిందంటే ఏ మగవాడికైనా ఆ చూపులు ఒక రోజు రోజంతా గుర్తుండిపోవాలి.

జ్యోత్స్న అప్పారావు వంక అదోరకంగా అభినందనంగా చూస్తుంది. అవి మామూలు చూపులు కావు. ఆమె తనను ప్రేమిస్తున్నదని అప్పారావుకు అంతరాంతరాల్లో అనుమానముంది. ఆ అనుమానానికి కొన్ని కారణాలున్నాయి.

అప్పారావు మనిషి బాగుంటాడు. అతడు ఇందుమతి కంటే బాగుంటాడు. జ్యోత్స్నను చూసినప్పుడల్లా తను ఇందుమతికి బదులు జ్యోత్స్నను చేసుకోవలసిందని అతడికి అనిపించేది. తన మనసులోని మాటను ఏదో విధంగా భార్య గ్రహించాలని— "ఆ పక్కింటావిడ నా వంక అదోలా చూస్తుంది. ఈ పొరుగు మనకు మంచిది కాదు" అని చెప్పాడో రోజున.

"ఆవిడ చూపులే అంత. మీ వంక ఎలా చూస్తుందో, నా వంక కూడా అలాగే చూస్తుంది" అన్నది ఇందుమతి—అతడి మాటలు తేలిగ్గా తీసి పారేస్తూ.

జ్యోత్స్న ఎన్నోసార్లు వాళ్ళింటికి వచ్చింది. అప్పారావుతో సాహిత్య చర్చలు చేసింది. పుస్తకాలు అందిస్తూనో, మరేదో వంక పెట్టి ఆమె అతడి చేతి వేళ్ళను అప్పుడప్పుడు తాకిందని అప్పారావు అనుమానం.

"అదంతా మీ భ్రమ. ఆవిడకు మొగుడంటే ప్రాణం. మాయా మర్మం తెలియని మనిషి ..." అనేది ఇందుమతి.

ఇందుమతి ఎటువంటి ఆడదో అప్పారావుకు అర్థంకాదు. సాధారణంగా ఆడవాళ్ళు భర్తలను వేధించే విషయాలేవీ పట్టించుకోదు.

అప్పారావు కాలేజీ రోజుల్లో తనకు ప్రేమ లేఖలు వ్రాసిన ఇద్దరమ్మాయిల గురించి చెప్పాడు. వినడానికి కూడా ఆమె ఆసక్తి చూపించలేదు. విన్నాక నవ్వలేదు.

జ్యోత్స్న పొరుగు ప్రమాదమనీ, వేరే ఇల్లు మారుదామనీ అంటే లెక్కచేయదు. ఇందుకు కారణమేమిటి?

స్త్రీగా ఆమెలో లోపాలున్నాయా?

లోపాల విషయమై అప్పారావు ఎక్కువగా ఆలోచించలేదు కానీ, ఒక్క విషయం అతడికి స్పష్టమయింది. రాత్రి ఆమె భర్త కోసమే తను ఏం చేసినా అన్నట్లు ప్రవర్తిస్తుంది. రోజంతా హడావుడి చేసి భర్తకు పూసిక నలగకుండా చేసే ఇందుమతి రాత్రి అయ్యేసరికి నిరాసక్తురాలిగా మారిపోతుంది.

తన దాంపత్య జీవితం యాంత్రికంగా ఉంటున్నదని అప్పారావుకు తెలుసు. కానీ, అందువల్ల అతడికేమీ నష్టం కనిపించలేదు.

ఇందుమతి అతణ్ణి ప్రేమిస్తున్నది. ప్రేమగా చూసుకుంటున్నది.

ఇందుమతి వంటి భార్య ఏ భర్తకైనా వరంలాంటిదే!

ఆఫీసులో చాలా మంది అప్పారావును అభినందిస్తూంటారు అతడి అదృష్టానికి!

అలా అభినందించిన వారిలో సుందర్రావు ఒకడు.

సుందర్రావు మంచి చలాకీ అయినవాడు. అతడు కొత్తగా ఆ ఆఫీసులో చేరాడు. అప్పారావు అదృష్టం గురించి విని అతడు ప్రత్యేకంగా అభినందించి, "నీలాంటి వాళ్ళు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలి. మూన్‌లైట్ క్లబ్బులో చేరకూడదూ" అన్నాడు

"ఏమిటా క్లబ్బు!" అన్నాడు అప్పారావు.

"అందులో గొప్పగొప్ప వాళ్ళకే గానీ ప్రవేశముండదు. అక్కడికి గొప్పింటి ఆడవాళ్ళు తరచు వస్తూంటారు. అక్కడ ఎవరికీ అహంభావం, అదుపూ ఉండదు. నీ లాంటి పెర్సనాలిటీ ఉన్నవాణ్ణి చూసి ఏ లక్షాధికారి కూతురో మోజు పడిందంటే అంతే. నువ్వు స్వర్గం చూస్తావు ..." అన్నాడు సుందర్రావు.

"నాలాంటివాళ్ళకు అందులో ప్రవేశం ఎలా వస్తుంది!" అన్నాడు అప్పారావు ఆశగా.

"ఎలాగేముంది? నేను అందులో మెంబర్ని. నా భార్య బాధ భరించలేక అందులోంచి రిజైన్ చేస్తున్నాను. పాత మెంబరు రిజైన్ చేస్తూ కొత్త మెంబర్ని ప్రపోజ్ చెయ్యొచ్చు. ఆ విధంగా నువ్వు అందులో ప్రవేశిస్తావు. ఒక వారం రోజులు నువ్వు

ప్రొబేషన్లో ఉంటావు. ఏ పిల్లైనా నువ్వంటే ఇష్ట పడిందా నీకు శాశ్వత సభ్యత్వం వస్తుంది. డబ్బుకూ లోటుండదు..."

"అయితే నే నా క్లబ్బులో చేరతాను" అన్నాడు అప్పారావు.

"ఇందుకు నీ భార్య ఒప్పుకోదు."

"ఒప్పుకుంటుంది."

"ఛాలెంజ్!" అన్నాడు సుందర్రావు.

మర్నాడు అప్పారావు వచ్చి విషయం భార్యతో మాట్లాడాననీ ఆమె ఒప్పుకుందనీ అంటే సుందర్రావు ఆశ్చర్యపడి, "యూ ఆర్ డబ్లీ లక్కీ!" అన్నాడు.

"క్లబ్బుకి ఎప్పుడు వెడదాం?" అన్నాడు అప్పారావు.

"నీ కో చిన్న సలహా. క్లబ్బులో ఆడవాళ్ళ ఎక్స్పెక్టేషన్ చాలా హైగా ఉంటుంది. నువ్వు నాటు రకం ట్రిక్కులో వెడితే వారం రోజుల్లో అక్కణ్ణించి గెంటేస్తారు. ఈ వూర్లో హో సెక్స్ స్పెషలిస్టున్నాడు. పేరు మాధవరావు. యాభై రూపాయల ఫీజుకి అయిదు లక్షల విలువచేసే సలహాలు, ఉపాయాలు చెబుతాడు. ముందు ఆయన సలహాలు తీసుకుని ఆ తర్వాత క్లబ్బులో చేరుదువుగానీ!" అన్నాడు సుందర్రావు.

అప్పారావు చాలా ఉత్సాహ పడ్డాడు. ఆ రోజే అతడు మాధవరావును కలుసుకున్నాడు. యాభై రూపాయలు సమర్పించుకున్నాడు

మాధవరావు అప్పారావుకు గంట సేపు చాలా చాలా చెప్పాడు.

"ఆడవాళ్ళను అవసరాలు తీర్చే యంత్రాల్లా కాక మనసున్న మనుషులుగా చూచుకోవాలి. వాళ్ళను లాలించాలి. అలరించాలి. అందుకు మానసికంగానూ, భౌతికంగానూకూడా కొన్ని పద్ధతు లున్నాయి" అంటూ శాస్త్రబోధ చేశాడు.

ఆయన చెప్పిన విషయా లేమీ అప్పారావుకు తెలియవు. అతడు ఆశ్చర్యపోయి—"ఇన్ని విషయాలు తెలీకుండా ఇన్నేళ్ళు ఎలాగున్నాను?" అన్నాడు.


"నువ్వే కాదు. ఎందరో యువతీ యువకులకు ఇలాంటి విషయాలు తెలియవు. తెలుసుకోవడానికి సిగ్గుపడి, తమ జీవితాలను నరకం చేసుకుంటున్నారు. భర్త వల్ల తృప్తి లేక భార్య భర్తను సాధిస్తుంది. భర్త విసుక్కుంటాడు" అన్నాడు మాధవరావు.

"ఆ విషయంలో మాత్రం నేనుఅదృష్టవంతుణ్ణి. నాకు మీరు చెప్పిన వన్నీ తెలియక పోయినా, ఇటువంటి బాధలు లేవు" అన్నాడు అప్పారావు. అతడికి సుందర్రావు, రంగనాథం వగైరాలు పడుతున్న బాధ అర్థమయింది. అయితే సుందర్రావుకి మాధవరావు తెలుసు. అయినా అతడి జీవితంలో నరకం ఎందుకుంది?

అదీ పరోక్షంగా మాధవరావు జవాబు చెప్పాడు

"నేను మీకు కొన్ని ఉపాయాలు చెబుతున్నాను. అది ఆచరించడం మీ సామర్థ్యం పై ఆధారపడి ఉంది."

అప్పారావు ఉత్సాహంగా ఇంటికి వెళ్ళాడు. ఆ రోజు అతడు భార్య కోసం మల్లెపూలు కొని




తీసుకుని వెళ్ళాడు ఇంటికి.

మాధవరావు ఉపాయాలు మొదటి సారిగా భార్య మీదనే ప్రయోగించి ఫలితం చూడాలని అనుకున్నాడు.

ఆ రోజు ప్రత్యేకంగా మంచం ఏర్పాటు చేయించాడు.

భోజనాల వద్ద భార్యతో చిలిపిగా ప్రవర్తించాడు. ఆమె నోట్లో ముద్ద ఉండగా ముద్దు పెట్టి ఉక్కిరి బిక్కిరి చేశాడు.

ఆ రాత్రి ఒక వింత రాత్రి!

దంపతు లిద్దరూ ఎప్పుడో తెల్లవారు జామున నిద్ర పోయారు.

నిద్ర లేచేసరికి బాగా ఆలస్యమయింది. ఎన్నడూ లేనిది ఇందుమతి భర్తను చూసి సిగ్గు పడింది.

అప్పారావు హడావుడిగా తెమిలాడు.

"ఈ రోజు మీరు ఆఫీసుకు వెళ్ళద్దు" అన్నది. ఇందుమతి.

"ఎందుకని?"

"నెమ్మదిగా తెమిలి, ఏ నూన్ షోకో వెడదాం" అన్న దామె.

"సుందర్రావుతో చెప్పాను—ఈ రోజు మూన్ లైట్ క్లబ్బుకు వెడదామని" అన్నాడు అప్పారావు కంగారుగా.

"పెళ్ళయినాక కూడా మీకు ఇదేం బుద్ధండీ. మీరు మూన్ లైట్ క్లబ్బులోనేకాదు, ఏ క్లబ్బులోనూ చేరడానికి వీల్లేదు" అన్నది ఇందుమతి.

"ఎందుకని?" అన్నాడు అప్పారావు.

"పోనీ, నేనూ చేరనా?" అన్నది ఇందుమతి.

"ఏమన్నావ్?" అన్నాడు అప్పారావు తెల్లబోయి.

"నేను చేరడానికి మీకు అభ్యంతరాలుంటే, అవే అభ్యంతరాలు నేనూ చెబుతాను" అన్నది ఇందుమతి.

"మరి మొన్న అలాగన్నావు?"

"మొన్నటి మీరూ, నిన్నటి మీరూ ఒకటి కాదు" అన్నది ఇందుమతి.

చెళ్ళున కొట్టినట్లయింది అప్పారావుకి. అతడింకేమీ మాట్లాడలేదు.

ఆ మరునా డతను ఆఫీసుకు వెళ్ళినప్పుడు, సుందర్రావతణ్ణి పలకరించి, "నిన్న నీ కోసం చూశాను" అన్నాడు

"నేను మూన్ లైట్ క్లబ్బులో చేరడం లేదు."

"నీ భార్య ఒప్పుకోలేదా?"

"లేదు."

"కంగ్రాట్యులేషన్స్!" అన్నాడు సుందర్రావు.

"ఎందుకని?" అన్నాడు అప్పారావు నీరసంగా.

"నీ భార్య నిన్ను భర్తగా కాక—అంటే కేవలం భరించువాడుగా మాత్రమే గాక మగవాడిగా గుర్తించినందుకు."

అప్పారావు మాట్లాడ లేదు.

అతడికి అర్థమయింది. ఇందుమతికి దాంపత్య జీవితమంటే ఏమిటో, అందులోని ఆనంద మేమిటో మగవాడిగా తానెంత సమర్థుడో అర్థమయింది. ఆమె వెనువెంటనే అతడిని అనుమానించడం మొదలు పెట్టింది.

ఇప్పుడు అప్పారావు శారదకు ప్రయివేట్లు చెప్పడం లేదు.

పొరుగున జ్యోత్స్న ఉన్న కారణంగా వేరే ఇల్లు మారాడు.

అంత కాలం తన అదృష్టంగా భావిస్తున్నది తన అసమర్థతగా గుర్తించడం కోసం సుందర్రావు మూన్ లైట్ క్లబ్బును సృష్టించాడా అన్న అనుమానం అతడికి ఉన్నప్పటికీ—సంసార జీవితం స్వర్గతుల్యంగా ఉండడం వల్ల సుందర్రావు మీద కోపం మాత్రం లేదు. ✱